క్లుప్తంగా

ఫార్మసీ విద్యార్థులకు క్యాంపస్ కొలువులు



క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో మాట్లాడుతున్న పూర్ణకుమార్

భీమవరం: స్థానిక కేజీఆర్ఎల్ ఫార్మసీ కళాశాలలో బుధవారం దివిస్ ఫార్మాల్యాబ్ నిర్వహించిన క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో 19 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిలో కేజీఆర్ఎల్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు 15 మంది, ఇతర కళాశాలలకు చెందిన నలుగురు ఉన్నారు. వీరంతా విశాఖపట్నం, కాకినాడ, హైదరాబాద్ ప్రాంతాల్లో ఉన్న దివిస్ ఫార్మాల్యాబ్‌లోని బల్క్‌డ్రగ్ ప్రొడక్షన్ విభాగంలో పనిచేస్తారని కంపెనీ హెచ్ఆర్ పూర్ణకుమార్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ కె.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డి.రాఘవ, వైస్ ప్రిన్సిపాల్ కె.నిర్మల తదితరులు అభినందించారు.

అయిభీమవరంలో టీడీపీ నాయకుల సంబరాలు


అయిభీమవరం కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఆకివీడు: ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణంరాజు స్వగ్రామంలో బుధవారం టీడీపీ నాయకులు విజయోత్సవం జరుపుకున్నారు. ఎన్నికల్లో ఘన విజయం చేకూర్చినందుకు గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపుతూ పలు వీధుల్లో బాణసంచా కాల్చుతూ ర్యాలీ నిర్వహించారు. తొలుత టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు జీవీ.సత్యనారాయణరాజు, కే.రామకృష్ణంరాజు, ఎస్.రామారావు, సోమరాజు తదితరులు పాల్గొన్నారు. స్థానిక 7వ వార్డులో విజయోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కిమిడి నాగరాజు, లక్ష్మణరావు, కోమటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్లలో సిల్టు తొలగించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్యామల


భీమవరం (ప్రకాశంచౌక్): మున్సిపల్ కార్యాలయంలో గురువారం పట్టణ పారిశుధ్యంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలోపు పట్టణంలోని ప్రధాన డ్రెయిన్లలో పూడిక తీయించేందుకు తగు ప్రణాళికతో సిద్ధం కావాలన్నారు. ప్రస్తుతం మున్సిపల్ పరిధిలో ఎంతవరకు డీసిల్టేషన్ వర్క్ పూర్తయ్యిందో అడిగి తెలుసుకున్నారు. మరో రెండు రోజుల్లో డీసిల్టేషన్ చేసిన వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. జులై 15వ తేదీలోపు డీసెల్ టేషన్ వర్క్ పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

అనారోగ్యంతో గరగపర్రు వీఆర్ఓ మృతి


స్వామి నాయుడు(ఫైల్)

పాలకోడేరు: గరగపర్రు వీఆర్ఓ సంపతి స్వామి నాయుడు (48) బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఈయనకు నాలుగు రోజుల క్రితం కొద్దిగా ఒంట్లో నలతగా ఉండటం తో భీమవరం లోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి పరీక్ష చేయించుకోగా హార్ట్‌లో బ్లాక్స్ ఉన్నట్లు గుర్తించారు. బుధవారం యాంజియోగ్రామ్ చేయించుకుంటూ మృతి చెందారు. ఈయన గతంలో పాలకోడేరు వీఆర్వోగా పనిచేసి గరగపర్రు వీఆర్వో గా బదిలీ అయి సేవలందిస్తున్నారు సమాచారం తెలిసిన వెంటనే తహసీల్దార్ కె.నాగార్జున, ఆర్ఐ నాగభూషణం నాయుడు, వీఆర్వోలు, వీఆర్ఏలు ఇతర సిబ్బంది ఈయన స్వగ్రామం అయిన తాడేరు వెళ్ళి భౌతికకాయం సందర్శించి నివాళులర్పించారు. ఈయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

అన్న క్యాంటిన్ ప్రారంభం


అన్న క్యాంటిన్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఆకివీడు: పేదలకు అన్నదానమే లక్ష్యంగా ముందుకు వెళ్ళాలని లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ ఎంవీ.సూర్యనారాయణరాజు చెప్పారు. స్థానిక దొరగారి చెరువు వద్ద గాంధీ చౌక్‌లో అన్న క్యాంటిన్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకతీతంగా నిరుపేదలకు భోజన సౌకర్యం కల్పించడం మానవత్వానికి నిదర్శనమన్నారు. మోటుపల్లి రామ వర ప్రసాద్, గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంపై ముగిసిన శిక్షణ



ఇంగ్లిష్ గ్రామర్ బుక్‌ను రిలీజ్ చేస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక భారతీయ విద్యాభవన్స్ స్కూల్లో నిర్వహించిన సెంట్రల్ సిలబస్ నూతన విద్యావిధానంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. శిక్షణకు రిసోర్స్ పర్సన్‌గా హాజరైన తమిళనాడు కొచ్చి ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఇతిల్ నైనా జోష్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో ర్యాంకులు, మార్కులు, బట్టీ పట్టే విధానం వల్ల విద్యార్థులకు ఉన్నతికి ఉపయోగపడదని, పాఠ్యపుస్తకాలు చదవి నాలెడ్జ్ పెంచుకోవడం ద్వారా ఉన్నతులుగా ఎదుగుతారన్నారు. రాష్ట్ర రీజనల్ ఎడ్యూకేషనల్ ఆఫీసర్ జేఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ విద్యాబోధనలో విద్యాసంస్థల యాజమాన్యాలు, ఉపాధ్యాయుల్లో మార్పు తప్పనిసరన్నారు. స్కూల్స్‌లో పచ్చదనంతో కూడిన విశాలమైన తరగతి గదులు, విశాల ప్రాంగణం ఏర్పాటును అనేక విద్యాసంస్థలు పక్కన పెట్టడం వల్ల విద్యార్థుల ఎదుగుదల అంతంతమాత్రమేనన్నారు, క్రమశిక్షణ, టైమ్ మేనేజ్‌మెంట్ ఉంటే విద్యార్థులు ఉన్నత విద్యావంతులవుతారని, దీనికి తల్లిదండ్రుల్లో కూడా మార్పు ఎంతో అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా ఇంగ్లిష్ గ్రామర్ బుక్‌ను రిలీజ్ చేశారు. కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాలో భవన్స్ కార్యదర్శి యూకే విశ్వనాథరాజు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ చైర్మన్ సామంతపూడి శ్రీరామరాజు, కోశాధికారి కొత్త శ్రీనివాస్, భవన్స్ సంచాలకులు బీవీ శేషగిరిరావు, ప్రిన్సిపాల్ ఎల్‌వీ రమాదేవి, ఎంఎస్ఎన్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నీరుగారుతున్న వాల్టా చట్టం


వేంద్ర అగ్రహారంలో రోడ్డులో చెట్లను నరికి వేసిన దృశ్యం

పాలకోడేరు: పర్యావరణ పరిరక్షణకు ప్రకృతిని కాపాడుకోవడంఅవసరం. అందుకోసమే ప్రభుత్వం వాల్టా చట్టం అమలు చేస్తోంది. ఈ చట్టం ప్రకారం నీరు, భూమి, చెట్లను రక్షించాల్సిన ఆవశ్యకత ప్రతి వారి పైనా ఉంది. అయితే అనేక చోట్ల ఈ చట్టాన్ని ఉల్లంఘించి చెట్లను విచక్షణా రహితంగా నరికి వేస్తున్నారు. పాలకోడేరు మండలం లోని వేంద్ర అగ్రహారం, విస్సాకోడేరు, మోగల్లు గ్రామాల్లో గత కొద్ది రోజులుగా సుమారు వంద తాడి చెట్లను నరికి వేశారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కోరుతున్నారు

చూశాడంటే... గీసేస్తాడంతే


న్యూస్‌పేపర్లతో తయారు చేసిన పొదరిల్లుతో పెరుమాళ్ల రాజేష్, తల్లిదండ్రులు నాగరాజు, దుర్గ. రాజేష్ గీసిన చిత్రం




దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రాన్ని గీస్తున్న రాజేష్

ఆకివీడు: చూశాడంటే... గీసేస్తాడంతే. తన మెదడు నుంచి కుంచెను పరుగులెత్తిస్తాడు. దేనిని చూసినా అలవోకగా తన కుంచె నుంచి చిత్రాన్ని గీసేస్తాడు. పిట్ట కొంచెం, కూత ఘనం అన్నట్లు పిన్న వయస్సులోనే ఎన్నో సృజనాత్మక చిత్రాలను తయారు చేయడమే కాకుండా, బొమ్మల్ని గీయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. మండలంలోని మందపాడు గ్రామంలో ఓ పేద వెనుకబడిన తరగతుల కులానికి చెందిన పెరుమాళ్ల నాగరాజు, దుర్గల ఏకైక కుమారుడు రాజేష్. రాజేష్ తన కళను ప్రపంచానికి తెలియజేసేందుకు మార్గం దొరకక మట్టి గోడలనే ప్రచార అస్త్రాలుగా ఎంచుకున్నాడు. తన ఇంటి మట్టి గోడపై గొప్ప నాయకుల చిత్రాలను గీసి అందరినీ అబ్బురపరుస్తున్నాడు. ఎంతో మంది నేతల చిత్రాలను అందంగా గీశాడు. చిట్టి చేతితో ×ఆమె౽ అందాలను తన కుంచెతో ఆరబోస్తున్నాడు. ఇంటి గోడపై నెహ్రూ, బోస్, అంబేడ్కర్, ఎన్టీఆర్, వైఎస్సార్ వంటి గొప్ప నాయకుల బొమ్మలను గీశాడు. కుంచెతో చిత్రాలే కాదు, సృజనాత్మకతతో బొమ్మల్ని తయారు చేస్తున్నాడు. న్యూస్ పేపర్లను రోల్ చేసి వాటిని అందమైన ఆకృతిని సృష్టిస్తున్నాడు. యువ ఆర్టిష్ట రాజేష్‌ను పలువురు అభినందిస్తున్నారు. ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రాజేష్ సివిల్ ఇంజినీర్ అవ్వాలన్నదే తన ఆశయమని చెబుతున్నాడు.

తోకతిప్పలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానం

భీమవరం అర్బన్: భీమవరం మండలం తోకతిప్ప గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తోకతిప్ప గ్రామంలో సీపీఎం మండల శాఖ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రక్షిత మంచినీరు ఫిల్టర్ చేయకుండా నేరుగా కుళాయిలకు పంపిణీ చేస్తుండడంతో నీరు బురదగా వస్తున్నాయని, గ్రామస్తులు ఆ నీటిని తాగలేకపోతున్నారని చెప్పారు. వెంటనే తోకతిప్ప సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బొడ్డు లక్ష్మీపతి, రేవు రామకృష్ణ, తిరుమాని నాగేశ్వరరావు, పొన్నమండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

ఉండి: భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు మేరకు ఏఎస్సై ఏ సూర్యనారాయణ కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం పాందువ్వ గ్రామానికి చెందిన చుక్కా గణేష్, భార్య కవిత అదే గ్రామంలో ఓ రైతుకు చెందిన ఆక్వా చెరువుపై పని చేస్తున్నారు.ఈ నెల 8న సాయంత్రం 6 గంటలకు కవిత తన తల్లికి అనారోగ్యంగా ఉందని చూసేందుకు వెళ్తున్నానని భర్తకు చెప్పి వెళ్ళింది.రెండు రోజుల తరువాత కూడా భార్య ఇంకా రాలేదని అత్తగారికి ఫోన్ చేసి ఆరా తీయడంతో తమ కుమార్తె ఇంటికి రాలేదని వారు చెప్పారని ఫిర్యాదులో పేర్కొన్నాడు.అప్పటి నుంచి బంధువులు, స్నేహితులు,తెలిసిన వారి వద్ద ఆమె ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో గణేష్ బుధవారం పోలీసులను ఆశ్రయించాడు.

పిడుగుల వానతో జాగ్రత్త




వర్షం వచ్చే ముందు పిడుగుల దృశ్యాలు

- కర్షకులపై పడుతున్న పిడుగులు
- జాగ్రత్తలు పాటించాలని వాతావరణ నిపుణుల సూచన

పెంటపాడు: ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరుతున్నాయి. వాతావరణంలో పెనుమార్పులు, సంభవిస్తున్నాయి. ఉరుములతో కూడిన వర్షం, పిడుగులు పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు, నిర్వహణశాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. ఏ ప్రాంతంలో పిడుగులు పడతాయోనని ఒక అరగంట ముందే ఆ ప్రాంతంలో గల సెల్‌ఫోన్‌లకు విపత్తు, నిర్వహణశాఖ వారు మెసేజ్‌లు పెడుతున్నారు. ముఖ్యంగా పిడుగులు పడే సమయంలో సెల్‌ఫోన్‌లు వినియోగించేవారు ప్రమాదాలబారిన పడుతున్నారు. వర్షం వచ్చే సమయంలో ఉరుములు, పిడుగులపాటు వల్ల విడుదలయ్యే పెద్దపెద్ద ధ్వనులు, వెలుతురుతో పాటు విద్యుత్ శక్తి విడుదలవుతుంది. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే పిడుగుపాటు బారి నుంచి తప్పించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

లైట్నింగ్ కండక్టర్ ఏర్పాటు చేసుకోవాలి

పిడుగుపాటు నుంచి తప్పించుకునేందుకు ఎత్తైన ప్రదేశాల నుంచి నేరుగా భూమిలోకి లైట్నింగ్ కండక్టర్ ఏర్పాటు చేసుకోవాలి. దీన్ని ఏర్పాటు చేసుకోవడం వలన పిడుగులో ఉన్న విద్యుదావేశం భూమిలోకి ఆకర్షించుకుంటుంది. ఎత్తైన కట్టడాలు చేసినప్పుడు ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.

అప్రమత్తతే శ్రీరామరక్ష

మెరుపులు, ఉరుములు వచ్చే సమయంలో చెవులు గట్టిగా మూసుకోవాలి. పిడుగు శబ్దంతో వినికిడి శక్తి కోల్పోయే ప్రమాదం ఉంది. ఉరుములు, మెరుపులు సమయంలో సురక్షిత ప్రాంతానికి వెళ్లే అవకాశం లేకపోతే నేలమీదకు పూర్తిగా కిందకు వంగాలి. నేలపై పడుకోకూడదు. నేలపై కూర్చున్నప్పుడు పాదాల ముందుభాగం మాత్రమే నేలను తాకాలి. శరీరంలో మరే ఇతర భాగం నేలను తాకకుండా చూసుకోవాలి. పాదాల మడమల ముందు ఒకదానిని ఒకటి తాకేలా ఉండాలి. అలా చేయడం వల్ల పిడుగుపడే సమయంలో నేలపై పడి దాని విద్యుత్ శక్తి ఒక పాదం నుంచి శరీరంలోకి ప్రవేశించినా వెంటనే రెండో పాదం నుంచి తిరిగి భూమిలోకి ప్రవేశిస్తుంది. శరీరంలోకి విద్యుత్ ప్రవహించే అవకాశాలు తగ్గుతాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా జిల్లాలోని వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మే, జూన్ నెలల్లో ఎక్కువగా పిడుగులు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. విపరీతంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతోపాటు క్యూములో నింబస్ మేఘాల కారణంగా పిడుగులు పడే ప్రమాదం ఉంది. ప్రజలంతా అప్రమత్తంగాఉండాలి. వర్షం వస్తున్నట్లు ముందే తెలుస్తుంది. కాబట్టి వీలైనంత వరకు ఇంటినుంచి బయటకువెళ్లకుండా ఉంటే మంచిదని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.

అమ్మవారికి ఇత్తడి గరగల సమర్పణ


అమ్మవారికి గరగలు సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీ మావుళ్లమ్మవారికి ఆకివీడుకు చెందిన శ్రీనివాస్ పురుషోత్తం నాగ వెంకట కనకదుర్గ దంపతులు ఐదు ఇత్తడి గరగలను (32 కేజీలు) అందజేశారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ పాల్గొన్నారు.

మంచినీటి చెరువు నింపే పనుల ప్రారంభం


చెరువు నింపే పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ వెంకటరమణ

నరసాపురం: పట్టణంలో మున్సిపల్ మంచినీటి చెరువును నింపే పనులను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ ప్రారంభించారు. ప్రధాన పంట కాలువకు నీటిని విడుదల చేయడంతో కాలువ నుంచి మోటార్ల ద్వారా చెరువులో నీటిని నింపే పనులు దీంతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ నరసాపురం పట్టణానికి భారీ విస్తీర్ణంలో చెరువు అందుబాటులో ఉంది కాబట్టి 40 రోజులకు సరిపడా నీరు నిల్వ ఉంటుందని చెప్పారు. వేసవిలో కూడా రెండు పూటలా నీరు ఇవ్వగలిగామన్నారు. ఇప్పుడు కాలువ నుంచి మోటార్ల ద్వారా చెరువులోకి నింపుతున్నామని చెప్పారు. చెరువు నింపే పనులు త్వరితగతిన పూర్తి చేసి స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ వై.సునీల్, మల్లాడి బుజ్జి పాల్గొన్నారు.

చిన్నారులు.. ఎత్తుకు పైఎత్తుల్లో దిట్టలు

చదరంగంలో రాణిస్తున్న వైనం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన చిన్నారులు చదరంగంలో రాణిస్తున్నారు. పట్టుమని పదేళ్లు నిండని వీరు ఎత్తుకు పైఎత్తులతో ప్రత్యర్థులను ఓడిస్తున్నారు. మాస్టర్స్ చెస్ అకాడమీ వారి ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు తాడేపల్లిగూడెం పట్టణంలోని కె.ఎన్.రోడ్డు అకాడమీ ఇనిస్టిట్యూట్‌లో మే 1 నుంచి జూన్ 10 వరకు ఉదయం, సాయంత్రం సమయాలలోల్లో నిర్వహించారు. ఈ శిబిరంలో పిల్లల నుంచి పెద్దలు వరకు హాజరయ్యారు. సీనియర్, ఇంటర్నేషనల్ రేటెడ్ కోచ్ ఎస్.ఎస్. చంద్రశేఖర్, అసిస్టెంట్ కోచ్ వై.డి.ప్రసాద్, కోచ్ ఉమామహేశ్వరీలచే తాడేపల్లిగూడెం, భీమవరం, తణుకులకు చెందిన సుమారు 40 మందికి క్రీడకారులకు చదరంగంలో వ్యూహాలు ఎలా రచించాలి, ఎత్తుగడలు ఎలా వేయ్యాలో వివిధ అంశాలపై మెలకువలు నేర్పించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎలా ఆడాలి అనే అంశాలపై శిక్షణ సాగింది. ఈ క్యాంపులో ఐదు సంవత్సరాలు చిన్నారులు సైతం శిక్షణ అందుకున్నారు. అనంతరం పోటీలు నిర్వహించి, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.


చదరంగం పోటీలలో పాల్గొన్న చిన్నారులు

ప్రీస్కూల్ నుంచి ప్రైమరీ స్కూల్స్‌కు..


విద్యార్థులను ప్రైమరీ స్కూల్స్‌కు సిద్ధం చేసిన అంగన్‌వాడీ టీచర్లు

పెనుమంత్ర: మండలంలోని వివిధ అంగన్‌వాడీ స్కూల్స్‌కు చెందిన ప్రీస్కూల్ విద్యార్థులను ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌లో బుధవారం చేర్పించారు. అంగన్‌వాడీల్లో ప్రీ స్కూల్ విద్యను పూర్తిచేసిన 5 ఏళ్లు నిండిన బాలబాలికలకు సర్టిఫికెట్లు ఇచ్చి జాయినింగ్ కోసం ప్రభుత్వ పాఠశాలలకు పంపించారు. పెనుమంత్ర గ్రామంలో 8 అంగన్‌వాడీలకు చెందిన విద్యార్థులను ఆయా అంగన్‌వాడీ టీచర్స్ పి.శాంతి, ఎస్.అరుణకుమారి, ఎ.వెంకటలక్ష్మి, కె.మంగాయమ్మ, పి.సత్యవేణి, ఎన్.వెంకటరత్నం, బి.సుజాత, టీవీ సుబ్బలక్ష్మి తదితరులు తమ పరిధిలోని పిల్లలను ప్రైమరీ పాఠశాలల్లో జాయిన్ చేశారు.

బడికి వేళాయె..

- పాఠ్య పుస్తకాల పంపిణీకి సర్వం సిద్ధం
- నియోజకవర్గంలో అన్ని పాఠశాలల్లో ఏర్పాట్లు పూర్తి

తణుకు అర్బన్: వేసవి సెలవులు ముగిసిన అనంతరం పాఠశాలలన్నీ గురువారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలతో అమలు చేసిన సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రూపుదిద్దుకున్నాయి. ఇందులో భాగంగా పునఃప్రారంభం రోజునే అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల ఫలితం నేడు విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సకాలంలో పుస్తకాలు అందనున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ముందు విద్యార్థులకు పాఠశాలలు తెరిచి 3, 4 నెలలైన తరువాత అరకొర పుస్తకాల పంపిణీ చేసేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పుస్తకాలకు ఎటువంటి కొరత లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకున్నారు. నాణ్యమైన విద్య, తరగతి గదులు, భోజనంతో పాటు పుస్తకాలు పంపిణీ, విద్యకు సంబంధించి అన్ని అంశాలు నూరు శాతం ఫలితాలు వచ్చేలా అమలు చేయడం వాటిని పర్యవేక్షించడం రాష్ట్ర ప్రభుత్వం తొలి ప్రాధాన్యతగా ప్రకటించడంతో ఉపాధ్యాయ వర్గాల్లో సైతం బాధ్యత, అంకితభావం పెరిగింది. పాఠశాలలు పునః ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా విద్యాశాఖాధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. నియోజకవర్గంలో అన్ని మండలాల ఎంఈఓ కార్యాలయాలకు పాఠ్య పుస్తకాలు వచ్చాయి. వాటిని ఎంఈఓలు, పాఠశాలల హెచ్ఎంలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమ అమలుకు ప్రత్యేక అధికారులను సైతం నియమించారు. మండలాల ఎంఈఓలు నిరంతరం పర్యవేక్షణ చేస్తారు. తణుకు నియోజకవర్గంలో 2018-19 సంవత్సరంలో 14489 మంది విద్యార్థులు ఉండగా గతేడాది ఆ సంఖ్య 15811 మందికి చేరింది. ఈ ఏడాది ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లుగా విద్యాశాఖాధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్


తణుకు నంబరు 14 మునిసిపల్ పాఠశాల


తణుకుకు చేరిన నోటు పుస్తకాలు